# భారతీయాంగ్ల కవులు

## డా.శ్యామల కల్లూరి



### ముందుమాట

చిన్నతనంలో
తల్లి రంగరించిన పోసిన భాష
మాతృభాష!
ఊహ తెలిసాక నువ్వు ప్రేమించి
స్వంతం చేసుకున్న భాష
ఆంగ్లభాష!
తల్లి నేర్పిన మాట
జ్ఞాపకాల పొరలమాటున
ఏనాడో మరుగున పడింది!
అఆఇఈలు కూడా రాని
స్థితి ఇపుడు నీది.
కష్టపడి నువు నేర్చుకున్న భాష
ఎంత కష్టపడ్డా సృజన శక్తికి బాట కానేరదు!
అందుకే ఎప్పుడూ నువు త్రిశంకులా
రెంటికీ చెడ్డ రేవడివై మిగులుతావని
నీ నిరంతర తపన!

అయితే అప్పుడప్పుడు అనిపిస్తుంది
తూర్పుకీ పడమరకీ
నువు కట్టే వంతెనలే నీ కవిత్వమని
నువ్వు ప్రేమించి దగ్గర చేసుకున్న
నీ ప్రియురాలు
నీ తల్లిలాటి మాతృభాషతో
మమేకమైతే నీ కోసం నువు

ఒక భూతల స్వర్గం నిర్మించుకోగలవు
నిరంతరం ఒక అస్థిత్వం కోసం
నువు పడే తపనకీ ఆరాటానికీ
అద్దం నీ కవిత్వం
అదే నీ కవితా వస్తువు!

ఆ అద్దంలో ముక్కలైన నీ ముఖం
నీ జ్ఞాపకాల జిగురుతో ఎంత చక్కగా
అంటించినా అతుకులు కప్పలేవు!
నీ జాతి వాడే మరొకడు చెప్పినట్టు
గతుకులు మాత్రం తప్పవు!
ఇది నిఖార్సయిన నిజం!
స్వంత దేశంలో ఆగంతకుడివి!
ప్రపంచాన్ని నీ రచనలతో జయించాలని
కలలుకనే స్వాప్నికుడివి!
భారతీయాంగ్లకవివి!

రెండు వందల సంవత్సరాల బ్రిటీషువారి పరిపాలన వలన చరిత్రలో ఎన్నడూ ఏ జాతీ మర్చిపోలేని బానిసత్వ శృంఖలాల జ్ఞాపకాలని మనకి మిగిల్చినదనేది ఒక నిఖార్సయిన నిజమైతే, దానితో పాటు రాబోయే యుగాలలో కొన్ని శతాబ్దల పాటు మనం బహుశ గర్వంగా చెపుకునే కొన్ని విజయాలకి సోపానాలు పరిచిందనేది కూడా మనం ఘంటాపథంగా చెప్పుకోగలిగిన విషయం అనటానికి ఏ మాత్రం సందేహించనక్కరలేదు. భారతీయాంగ్లసాహిత్య చరిత్రని రాస్తూ ప్రొ.కె.ఆర్.శ్రీనివాస అయ్యంగారు అన్నట్టు బ్రిటీష్ పాలన మనకి మిగిల్చిన చెరగని సాంస్కృతిక ముద్రలు ముఖ్యంగా మూడయితే - క్రికెట్ పై భారతీయుల మక్కువ మొదటిదనీ, భారతీయ శిక్షాస్మృతి రెండవది అని చెబుతూ ఆంగ్ల భాషపై మనకున్న మక్కువ ముచ్చటగా మూడవది అని చెపుతారు. భారతీయభాషలో జరుగుతున్న విద్యావిధానానికి స్వస్తి చెప్పి పద్దెనిమిది, పందొనిమిది శతాబ్దాలలో దేశంలో అనేకచోట్ల ఆంగ్లభాషా మాధ్యమం ద్వారా విద్యాబోధన మొదలైనపుడు మన ఈ చారిత్రక ప్రయాణానికి అంకురార్పణ జరిగింది. అప్పటి రోజులలో బెంగాలులో బీజాలుపడి యావద్భారతంలోను ఆంగ్లభాషాబోధన విస్తరించింది. శతాబ్దాల బానిసత్వపాలనలో తమ జాతి సహజ సంస్కృతీవాసనలని విస్మరించిన అప్పటి యువతకి ఆంగ్లేయుల సాహిత్యం, కవిత్వం కొత్త ప్రపంచపు ద్వారాలని తెరిచాయి. ఈ సాహిత్యపువెల్లువలో కొట్టుకుపోయిన మొదటి తరం యువకులు ఆ కవులచే ప్రభావితులై, ఆ సాహిత్యాన్ని క్షుణంగా అధ్యయనం చేయటమేగాక వారిలా రాయాలని తపన చెందటం మొదలెట్టారు. అలా మొదలైన మన ప్రయాణం ఇప్పుడు ఏ స్థితికి వచ్చిందంటే ప్రపంచంలో ఆంగ్లభాషతో ప్రమేయమున్న ప్రతిదేశంలోను భారతీయులు కీలక స్థానం పొందటమేకాక బుకర్, పులిట్జర్ పురస్కారాలలాంటి విశేష సాహిత్య పురస్కారాలని కూడ ఒకసారి కాదు పదే పదే పొందటం లేకపోతే నామినేట్ అవటం మనం ఈనాడు చూడగలుగుతున్నాం. అమెరికాలాంటి దేశాలలో అయితే నేడు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఆర్థిక, వైజ్ఞానిక శాస్త్రాలలో భారతీయుల సహకార కారణంగా ఆదేశాలు పురోగతి చెందుతున్నాయి. ఆంగ్ల భాషాపరిజ్ఞానం మన యువతని ఎన్నో కీర్తిశిఖరాలని ఎక్కించటానికి ముఖ్యకారణమయిందనేది కూడా జగమెరిగిన సత్యం.

సాహిత్యపరంగా ఈ సంస్కృతీ వికాసాన్ని గురించి చాలా తక్కువమందికి తెలుసు. కేవలం సాహిత్యాభిమానులకేకాక భారతీయాంగ్ల భాషా సాహిత్యంతో తక్కిన అందరికీ పరిచయం చేసుకోవటం ఈనాడు చాలా ముఖ్యం. ఆ ఉద్దేశ్యంతో ఈనాడు ఈ సాహిత్యాన్ని అనేక విశ్వవిద్యాలయాలలో ప్రపంచవ్యాప్తంగా ప్రవేశపెడుతున్నారు. ఐతే విశ్వవిద్యాలయాలతో ప్రమేయంలేకుండా కేవలం అభిలాషతో ఆసక్తితో ఈ సాహిత్యాన్ని పరిచయం చేసుకోవాలనుకునేవారికి కౌముది ద్వారా తెలియచేయటానికి ఇదొక ప్రయత్నం. ఈ సాహిత్యం మొదలయిన తొలిదినాలనుంచీ నేటి వరకు కవిత్వాన్ని రాసిన ప్రముఖుల గురించిన వ్యాసాలు పాఠకులముందుకు తెస్తాను. చదివి ఆనందించండి.

ఈ వ్యాసాలలో ముఖ్యంగా భారతీయాంగ్లకవుల జీవితాలు, చరిత్రలు, వారి కవిత్వంగురించిన విశేషాంశాలు, కొన్ని కవితల అనువాదాలు ఉంటాయి. హెన్రీ డెరోజియో, మన్మోహన్ దత్, తొరు దత్, మైఖేల్ మధుసూదన్ దత్, సరోజినీ నాయుడు, శ్రీ అరవిందులు, రవీంద్రనాథ్ ఠాగూర్ లాంటి స్వాతంత్ర్య పూర్వ కవులతోపాటు, నిసీమ్ ఇజేకియల్, జయంత మహపాత్ర, ఎ.కె.రామానుజ, ఆర్.పార్థసారథి, కేకి దారువలా, సుజతా భట్, ఆఘా షహీద్ ఆలీలంటి స్వాతంత్ర్యానంతర కవులుకూడా ఉంటారు. నా ప్రయత్నాన్ని సహృదయంతో స్వీకరించి తగిన సలహాలు ఇస్తారని ఆశిస్తున్నాను.

*డా. శ్యామల కల్లూరి*

*మానవీయ సామాజిక శాస్త్ర విభాగం, ఐ.ఐ.టి న్యూఢిల్లీ*

✡ ✡✡